క్లుప్తంగా...

విద్యార్థులకు మంత్రి అభినందన



అమీర్‌పేట: ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సత్కరించారు. అజయ్ 986, హాసిని 985, సఫియా తహసీన్ 984, ముక్తేశ్వర్‌రావు 983 మార్కులు సాధించారు. బుధవారం వారు మంత్రిని కలువగా విద్యార్థులను సత్కరించి అభినందించారు.

విదేశీ, ప్రైవేట్ వర్సిటీలు ప్రమాదకరం

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో విదేశీ, ప్రైవేటు వర్సిటీలు ప్రమాదకరమని, ప్రభుత్వ వర్సిటీలను కాపాడుకోవలసిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేసరి అన్నారు. బుధవారం ఓయూలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని ధ్వజమెత్తారు. వర్సిటీల పరిశోధనలకు నిధుల కోత విధించి శాస్త్రీయ విద్యకు తిలోదకాలు ఇవ్వడం అన్యాయమన్నారు. విదేశీ, ప్రవేటు వర్సిటీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.

మాణికేశ్వర్‌నగర్‌లో ఇంటింటికీ సీపీఐ

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో బుధవారం ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ సంపదను అదానికి అమ్ముతున్న మోదీ సర్కార్ బీజేపీ హటావో దేశ్ బచావో పేరుతో ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు ప్రజల వద్దకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా సీపీఐని బలోపేతం చేద్దాం, ప్రజా పోరాటాలను నిర్మిద్దాం, దోపిడీ శక్తులను ఓడిద్దాం అంటూ రూపొందించిన బుక్‌లెట్లను ప్రజలకు పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను క్షేత్ర స్థాయిలో వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు మరో వైపు యువత నిరుద్యోగ సమస్యతో సతమతవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గద్దె దిగడం తప్పదన్నారు. ప్రజాస్వామిక వాదులు, లౌకిక వాదులు మత తత్వ విధానాలను ఖండించి బీజేపికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, ఛాయాదేవి, స్టాలీన్,యాదగిరి, శ్రీనివాస్, ఉమర్‌ఖాన్, లతీఫ్, ఖదీర్, పరుశరాం, కళ్యాణ్, శివప్ప పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



చిలకలగూడ : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న మధ్యాహ్నం గాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న ఓ యువకుడిని ముగ్గురు వ్యక్తులు గాంధీ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. బాధితుని వివరాలు వెల్లడించకుండా అవుట్ పేషెంట్ చిట్టీ తెస్తామని చెప్పి అక్కడి నుంచి పరారయ్యారు. ఎంత సేపటికీ రాకపోవడంతో స్ట్రెచర్‌పై ఉన్న బాధితునికి వైద్యపరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆస్పత్రి అధికారులు నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రి ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నామని, మృతుని వయసు 35 ఏళ్లు ఉంటాయని, కుడిచేతిపై జితేందర్, క్రిషి పేరుతో పచ్చబొట్టు ఉందని సంబంధీకులు ఉంటే 040–27853597 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ నరేష్ పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

అడ్డగుట్ట: పదో తరగతి పరీక్షల్లో తప్పినందుకు ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్డగుట్ట డీ సెక్షన్‌కు చెందిన ప్రణీత్(15) బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: స్థలం అమ్మిన డబ్బులు సకాలంలో రాకపోవడంతో కుమార్తె నిశ్చితార్థం ఆగిపోతుందనే ఆందోళనతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనా గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. గాంధీనగర్ ప్రాంతానికి చెందిన నర్సింగరావు (57) తన సోదరునితో కలిసి బంగారు షాపు నిర్వహిస్తున్నాడు. తన కుమార్తెకు వివాహం కోసం ఘట్‌కేసర్ వద్ద నున్న 430 గజాల స్థలాన్ని ఓ వ్యక్తికి విక్రయించాడు. గురువారం (నేడు) నిశ్చితార్థం ఉండగా డబ్బులు ఇంకా అందలేదు. స్థలం అమ్మిన డబ్బులు ఇంకా రాకపోవడంతో ఆందోళనకు గురైన నర్సింగరావు మంగళవారం బంగారు ఆభరణాల తయారీలో ఉపయోగించే సైనైడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

కాంగ్రెస్ దరఖాస్తుకు అనుమతి

- ప్రైవేటు భవనాలపై నో హోర్డింగ్స్
- ఎస్‌టీపీలు, ప్రకటనల పాలసీ రూపకల్పనకు నిర్ణయం
- ఉమెన్ హాస్టల్‌కు నిధుల మళ్లింపుతో మరింత వేగవంతం
- బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు



బోర్డు సమావేశంలో చర్చిస్తున్న ఎంపీ రేవంత్ రెడ్డి, అధికారులు, బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీ భవన నిర్మాణానికి అనుమతి.. ప్రైవేటు భవనాలపై హోర్డింగ్‌ల తొలగింపు.. ఎస్‌టీపీల ఏర్పాటుకు ప్రణాళికల రూపకల్పన, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే విగ్రహాల ఏర్పాటుకు స్థలాల కేటాయింపుపై చర్చ, బోర్డు ఆదాయ మార్గాల పెంపు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టడం, స్థూలంగా ఇదీ కంటోన్మెంట్ బోర్డు సమావేశం తీరు. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో బుధవారం కంటోన్మెంట్ సమావేశం జరిగింది. ఎంపీ రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న ఈ సమావేశంలో సభ్య కార్యదర్శిగా సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

చర్చకు వచ్చిన ప్రధానాంశాలు

- కొన్నేళ్లుగా కంటోన్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారిన బోయిన్‌పల్లిలో పదెకరాల స్థలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు బోర్డు ఆమోదం తెలిపింది. కలెక్టర్ ఎన్‌ఓసీ కోసం కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తునకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ విడుదల చేయడంతో కథ సుఖాంతం అయింది.
- కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసే సెల్ టవర్ల విషయంలో విధి, విధానాలు రూపొందించాలని నిర్ణయించారు.
- టోల్‌ట్యాక్స్ రద్దుతో కంటోన్మెంట్‌కు ఏటా రూ.9 కోట్లు నష్టం వాటిల్లుతోందని, ఈ మేరకు పరిహారం ఇవ్వాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మరోసారి కోరాలని తీర్మానించారు. జీఎస్‌టీలో కేంద్ర వాటాను కంటోన్మెంట్‌కు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని అధికారులు వెల్లడించారు.
- కంటోన్మెంట్ వ్యాప్తంగా ఎస్‌టీపీల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, తొలుత బొల్లారంలోని సీజీహెచ్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- కార్ఖానాలో నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు కేంద్రం నిధులు వచ్చేంత వరకు బోర్డు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తిచేయాలని తీర్మానించారు.
- మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ దర్గ దయాకర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కంటోన్మెంట్ వ్యాప్తంగా గ్రంథాలయాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని నిర్ణయించారు.
- దివంగత ఎమ్మెల్యే సాయన్న విగ్రహాల ఏర్పాటుకు జేబీఎస్ సమీపంలో, వెస్ట్‌మారేడుపల్లిలో స్థలం కేటాయించాల్సిందిగా సాయన్న కుమార్తెలు విజ్ఞప్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. అదే సమయంలో దివంగత ఎంపీ నంది ఎల్లయ్య విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయాలని ఎంపీ రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రతిపాదనలపై రక్షణ శాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు.
- కారుణ్య నియామకాల విషయంలోనూ రక్షణ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వస్తే వెంటనే నియామకాలు చేపడతామన్నారు.
- జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ సమీపంలోని 1735 గజాల స్థలాన్ని ఎల్ అండ్ టీ సంస్థకు పార్కింగ్ కోసం లీజుకిచ్చే అంశంపై బోర్డు తీర్మానం చేసింది. అయితే ఇందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ఎంపీ రేవంత్ రెడ్డి సూచించారు.
- బోర్డుకు ఏటా రూ.1 కోటి మేరకు ఆదాయం వస్తున్నప్పటికీ, భద్రత దృష్ట్యా ప్రైవేటు భవనాలపై ఉన్న హోర్డింగ్‌లను పూర్తిస్థాయిలో తొలగించాలని తీర్మానించారు.
- బోయిన్‌పల్లిలోని ఫైజాన్ స్కూలుకు వెళ్లే దారిని ఆర్మీ అధికారులు మూసేశారని, తక్షణమే ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీ రేవంత్ రెడ్డి కోరారు. ఇందుకు అవసరమైతే ఎంపీ నిధులు కేటాయిస్తామన్నారు.
- కంటోన్మెంట్‌కు అదనపు నీటిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.17 కోట్లు కనెక్షన్ ఛార్జీల కింద కోరుతోందని, ఈ మేరకు చెల్లించేందుకు సిద్ధమని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ వెల్లడించారు.

కాంగ్రెస్–బీఆర్ఎస్ దోస్తీ తేటతెల్లం



మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: తమ పార్టీ మొదటి నుంచి చెబుతున్నట్లుగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని కంటోన్మెంట్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ ఆరోపించారు. బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి పదెకరాల అత్యంత విలువైన భూమిని కట్టబెట్టే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయడం ద్వారా ఆ రెండు పార్టీల మధ్య ఉన్న బంధం మరోసారి వెల్లడైందన్నారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివంగత వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ పార్టీకి పదెకరాల భూమిని కేటాయించారు, ఇన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఆ స్థలంలో నిర్మాణాల కోసం గతేడాదే కాంగ్రెస్ పార్టీ తరఫున దరఖాస్తు చేశారు. అయితే ఈ భూ కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఉందని, తాను అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ దరఖాస్తు ఇంతకాలం పెండింగ్‌లో ఉందన్నారు. కలెక్టర్ నుంచి తాజా ఎన్‌ఓసీ తీసుకోవాలని గతంలో బోర్డు తీర్మానం చేసిందన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ప్రత్యేక జీఓ విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బోర్డు సమావేశంలో ఈ జీఓను వెల్లడిస్తూ అనుమతులు పొందడం గమనార్హం అన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి పదెకరాల భూమిని కట్టబెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్‌లోని పేదలకు పట్టాలు ఇచ్చేందుకు భూ బదలాయింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్మీ స్థలాలు ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదల జాబితా సిద్ధం చేస్తామన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



రవిసింగ్ బిడ్లాన్‌ను సన్మానిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహన్ని అందిస్తూ వారి ఉన్నతికి తోడ్పడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కేరళలో ఇటీవల జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 105 కిలోల విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్న సనత్‌నగర్‌కు చెందిన రవిసింగ్ బిడ్లాన్‌ను సన్మానించి అభినందించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో కలిసిన రవిసింగ్‌బిడ్లాన్ తాను సాధించిన పతకాలను మంత్రికి చూపించారు. తలసాని మాట్లాడుతూ.. క్రీడా హబ్‌గా తెలంగాణ నిలుస్తోందని ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి క్రీడాకారులు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఏషియన్ టైటిల్ స్ట్రాంగ్ మెన్ బెస్ట్ లిఫ్టర్‌అవార్డును రవిసింగ్ కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవార్డులు గెలవాలని ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో కొలను బాల్‌రెడ్డి, నవీన్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రవికుమార్, నర్సింగ్‌రావు, నవీన్ బిడ్లాన్, ముఖేష్‌కుమార్, రమేష్ ఉన్నారు.

నాలుగు నెలలు.. 131 మంది దొంగల అరెస్ట్

అడ్డగుట్ట: రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న 131 మందిని నాలుగు నెలల్లో అరెస్ట్ చేసినట్లు ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్‌సీ డెబస్మిత సీ బెనర్జీ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆపరేషన్ యాత్రి సురక్షలో భాగంగా రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ఆర్పీఎఫ్ పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని అందుకు నిదర్శనమే గడిచిన నాలుగు నెలల్లో 131 మంది దొంగలను అరెస్ట్ చేయడమే అన్నారు. అదే విధంగా ఈ నెల 9న సికింద్రాబాద్, పార్లి రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ తర్వాత దొంగలుగా నిర్ధారించి వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించామన్నారు.

గాంధీలో సీడాక్ పనుల పర్యవేక్షణ



పనులను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌గాంధీ ఆస్పత్రిని సందర్శించిన వైద్య ఉన్నతాధికారులు సీడాక్ పనులను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం నేరుగా ఆస్పత్రికి చేరుకున్న వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీముర్తుజా రజ్వీ, కమిషనర్ శ్వేత మహంతి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్) పనులను స్వయంగా పరిశీలించారు. అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్, డాక్టర్స్ యాప్, ల్యాబ్ ఇంటిగ్రేటెడ్ సిస్టం (ఎల్ఐఎస్)ల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రధాన భవనం నాల్గో అంతస్తులోని పెథాలజీ, మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లను సీడాక్‌తో అనుసంధానం చేసిన ప్రక్రియను పరిశీలించి నివేదికలు, ప్రింట్ అవుట్ తదితర అంశాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి పాలనాయంత్రాంగం సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందించారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఆర్ఎంఓ–1 జయకృష్ణతోపాటు సీ డాక్ సంస్థ ప్రతినిధులు, పాలనయంత్రాంగ అధికారులు, ఆర్ఎంఓలు పాల్గొన్నారు.

క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి సూచించారు. నగరంలోని జీహెచ్ఎంసీ వేసవి శిక్షణా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బుధవారం ఎస్పీరోడ్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో స్పోర్ట్స్ క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ స్పోర్ట్స్‌పై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ క్విజ్‌లో విజేతలకు మరో డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసగౌడ్, బాక్సింగ్ కోచ్ కృష్ణలతో కలిసి ముకుంద్‌రెడ్డి బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి అందులో శిక్షణ అందించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నగరంలో విద్యార్థులకు వివిధ స్పోర్ట్స్‌లో శిక్షణ అందించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నామని క్రీడలతో కూడా ఎంతో భవిష్యత్ ఉంటుందని, దేశానికి పేరు తెచ్చిన ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారని గుర్తుచేశారు. మొదటి బహుమతి షీమా సుల్తానా, ఎండీ ఆహిల్, ద్వితీయ బహుమతి వర్ష, అంబికా, తృతీయ బహుమతి అకిబ్, రిషికేష్ దక్కించుకున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

చిలకలగూడ : రాజ్యాంగం రూపొందించిన మహిళా చట్టాలపై అవగాహన అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కిందిబస్తీ అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళ శక్తి కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోసం రూపొందించిన చట్టాలు, సంక్షేమ పథకాలను వినియోగించుకునేందుకు మహిళలంతా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. హింసకు గురైన మహిళలు సఖి, భరోసా కేంద్రాలను ఆశ్రయించాలని సూచించి, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్‌లను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో మహిళ శక్తికేంద్రం, అంగన్‌వాడీ ప్రతినిధులు జాహ్నవి, లక్ష్మీ తేజస్విని, ఝాన్సీరాణి, కౌసల్య పాల్గొన్నారు.





గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రసిడెంట్ గౌరపల్లి రమేష్ జన్మదినం సందర్భంగా బుధవారం బేగంపేట్ మయూర్‌మార్గ్‌లో స్థానికులు, పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి హాజరై ఆయనతో కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. –సాక్షి, సిటీబ్యూరో

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

డిప్యూటీ స్పీకర్ పద్మారావు



పనులు ప్రారంభిస్తున్న పద్మారావు గౌడ్, కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. వేసవి ముగిసేలోగా రహదారుల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. అనంతరం బీదలబస్తీలో రూ.37 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో కమ్యూనిటీహాల్, మమ్మద్‌గూడలో రూ. 19 లక్షలతో నాలా ప్రహరీ, ఏక్‌మినార్ మసీదు వద్ద రూ. 9.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. జలమండలి డీజీఎం కృష్ణ, అధికారులు అన్విత్, కౌషిక్, నవ్య, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వరగౌడ్, కరాటే రాజు పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి ప్రాముఖ్యం..

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అత్యధిక ప్రాముఖ్యం కల్పిస్తోందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. మన బస్తీ–మన బడిలో భాగంగా అడ్డగుట్టలోని లాలాగూడ నెం.1 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ. 12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన తరగతి గదులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సికింద్రాబాద్‌ను వైద్య కేంద్రాల సమాహారంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. సికింద్రాబాద్ ప్రజల సుదీర్ఘ ఆకాంక్షలు నెరవేరేలా కొత్తగా సీతాఫల్‌మండిలో జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని, వీటితో పాటు హై స్కూల్ భవనాల నిర్మాణానికి రూ. 30 కోట్లతో ముఖ్యమంత్రి నుంచి ప్రత్యేక నిధులను సమకూర్చుకున్నామని తెలిపారు.కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, మండల విద్యాధికారి బాలు నాయక్, శ్రీను, రామేశ్వర్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్, రమణమ్మ, పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

అడ్డగుట్ట: పేదలకు ఉపయోగపడేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వ బీఆర్ఎస్ అని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. తుకారాంగేట్ బోయబస్తీలోని కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసి మాట్లాడారు. అడ్డగుట్టను నగరంలోనే ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పేదలకు పెళ్లిళ్లు చేయడం కష్టతరంగా మారిన దశలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం బాసటగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ప్రొ.అన్సారీ అంశంపై మైనార్టీ కమిషన్ సీరియస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ పట్ల అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా పరిగణించిం రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని మైనార్టీ కమిషన్ బుధవారం రిజిస్ట్రార్‌కు నోటీసు జారీ చేంది. ఓయూలో నాలుగు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఇంత వరకు పీఎఫ్‌తో పాటు పింఛన్, ఇతర బెనిఫిట్స్ ఇవ్వకపోవడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్త చేసింది. ప్రొ.అన్సారీ అంశం పూర్తి నివేదికను సమర్పించాలని కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ ఓయూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా వీసీ ప్రొ.రవీందర్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వేధిస్తున్నారని ఫిబ్రవరి వేతనంతో పాటు పింఛన్ రాకుండా అడ్డుకుంటున్నారని ప్రొ. అన్సారీ ఆరోపించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి సీతారాంపూర్‌లోని శివ పంచాయతన వీరాంజనేయ స్వామి దేవాలయ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కొండ మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి బీజేపీ నేతలు బానుక మల్లికార్జున్, బానాల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. సీతారాంపూర్ పరిధిలోని 15 కాలనీల్లో ప్రముఖ దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. స్థానికులు కోరిన వెంటనే ఇటీవల రూ.12 లక్షల బోర్డు నిధులతో రోడ్డు నిర్మాణం చేయించామన్నారు. రామన్నకుంట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తమ బోర్డు సభ్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, గోపాల్ గౌడ్, గోవర్ధన్, నారాయణ, సత్యనారాయణ, నాగభూషణం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జెడ్సీకి వినతి



అడ్డగుట్ట: డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు అడ్డగుట్ట డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నేతలు బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హంసరాజు మాట్లాడుతూ.. తుకారాంగేట్ పహాడీ హనుమాన్ దేవాలయం నుంచి టీచర్స్ కాలనీ వరకు సీసీ రోడ్డు, అదే విధంగా పార్కు విషయమై రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపి పనులు చేపట్టాలని కేంద్ర మంత్రి జెడ్సీకి లేఖ రాసినట్లు తెలిపారు. మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయం నుంచి అడ్డగుట్ట చౌరస్తా వరకు సీసీ రోడ్డు నిర్మాణం, వరద నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. వెంకట్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంచినీటి నల్లాను కూడా ఏర్పాటు చేయాలన్నారు.



గాయత్రి 10/10



అంజనేయులు (9.8)



ఏ. శ్రీకరి(9.8)



బి. అక్షయ (9.8)



నేహ(9.8)



వి. రాఘవేందర్ (9.7)

‘సర్కారు’ పిల్లలు.. పదిలో మెరిశారు

అమీర్‌పేట: పది పరీక్షా ఫలితాల్లో అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఎ.గాయత్రి 10కి10 సాధించగా బి.సందీప్ 9.3, రుహి 9.ఎం.చరణ్ 9.0 సాధించారు. గాయత్రి తండ్రి పరమేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు మధు తెలిపారు.

మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల..

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల, తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ ఎయిడెడ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చరారు. మడ్‌ఫోర్ట్ పాఠశాల విద్యార్థి జరుపుల అంజనేయులు 9.8 టాపర్‌గా నిలిచాడు. మడ్‌ఫోర్ట్ గుడిసెల్లో ఉంటూ అడ్డా కూలీగా పని చేస్తున్న వెంకటయ్య–జీలమ్మల కుమారుడు వావిల్ల రాఘవేందర్ 9.7 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించాడు. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం రాంపూర్ తండాకు చెందిన పత్లావత్ సూర్యనాయక్, సమ్లీబాయి దంపతుల కుమారుడు వినోద్ 9,5 మార్కులు సాధించాడు. తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థిని ఏ శ్రీకరి 9.8, అలేఖ్య 9,8 మార్కులు సాధించారు.

బన్సీలాల్‌పేట్: ఓల్డ్‌బోయిగూడలోని ఆదయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల నుంచి 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి వైష్ణవి, సాయిక్రిష్ణలు 8.3, సాధించారు. హైదర్‌బస్తీ గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక బాలికల పాఠశాల విద్యార్థులు నిఖిత 8.7 సాధించింది. న్యూబోయిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి అరుణ్ కుమార్ 9.3, మట్టి ఇంద్రఫణి కుమార్ 9.3గ్రేడ్‌తో సాధించారు.

అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో..


అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 63.3 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థులు 18 మంది పరీక్షలు రాయగా అందులో 12 మంది మాత్రమే పాస్ అయ్యారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 61 మంది పరీక్ష రాయగా, 38 మంది మాత్రమే పాస్ అయ్యారు. మొత్తం మీద పరీక్ష రాసిన 79 మంది విద్యార్థుల్లో 50 మంది పాస్ అయినట్లు స్కూల్ ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు మాత్రమే 8 పైబడిన గ్రేడ్లు సాధించారు.

చిలకలగూడ : సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలకు చెందిన గోపిరెడ్డి పావని 9.3 జీపీఏ సాధించి స్కూలు టాపర్‌గా నిలిచింది.నామాలగుండుకు చెందిన పావని 9.3, నీజర్ 8.3 సాధించారు.

లాలాపేట పాఠశాల నుంచి..

లాలాపేట: లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల (మార్కెట్ స్కూల్) విద్యార్థినులు సత్తా చాటారు. మొత్తం 40 మంది పరీక్ష రాయగా 37 మంది ఉత్తీర్ణులయ్యారు. మారెడుపల్లి మండల పరిధిలోనే లాలాపేట ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి సరళాదేవి తెలిపారు. ఎస్ దుర్గా 8.8, పి. కావ్య 8.7, ఐశ్వర్య 8.2, సాధించారు.

రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట ఓల్డ్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన నేహ 9.8 సాధించి టాపర్‌గా నిలిచింది. రెజిమెంటల్‌బజార్‌లోని హిల్ స్ట్రీట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మేకల శ్రీనివాస్‌కు 9.5 జీపీఏ సాధించాడు.




వినోద్ (9.5)



మేకల శ్రీనివాస్(9.5)



అరుణ్‌కుమార్(9.3)



ఇంద్రఫణికుమార్(9.3)



గోపిరెడ్డి పావని(9.3)